ఆంధ్ర ప్రదేశ్
మరియు తెలంగాణ
అన్ని నియోజకవర్గాలలో
విజ్ఞాన్ పత్రికకు
విలేఖరులు కావలెను
ఫోన్ నెం. 99517 75293

VIGNAN PATRIKA

APTEL/2024/89102

# విజ్ఞాన్ పత్రిక

తెలుగు దినపత్రిక (Telugu Daily Paper)

సంపుటి : 02 సంచిక : 61 ఎడిటర్ : కలికి ఉదయ్ కుమార్ రెడ్డి బుధవారం 01 ఏప్రిల్ 2026 పేజీలు : 04 వెల : 02







# మంత్రి నాదెండ్ల మనోహర్ కి మత్స్యకారుల బోట్ల సమస్యపై అర్జీ సమర్పించిన.. మత్స్యకార నాయకులు.



**నెల్లూరు విజ్ఞాన్ దిన పత్రిక రిపోర్టర్** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సివిల్ సప్లైస్ మంత్రి, జనసేన పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ నెల్లూరు పర్యటన సందర్భంగా, కావలి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి అళహరి సుధాకర్ ఆధ్వర్యంలో మత్స్యకార నాయకులు మంత్రిగారిని కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మత్స్యకార విభాగ రాష్ట్ర కార్యదర్శి కోడింగారి శ్రీనివాసులు, కావలి నియోజకవర్గ మత్స్యకార అధ్యక్షుడు ప్రళయకావేరి రవి, కావలి అధికార ప్రతినిధి రుషికేశ్ పాల్గొన్నారు. మత్స్యకారులు తమ సమస్యలను వివరించడంతో పాటు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ని కలిసే అవకాశాన్ని కల్పించ వలసిందిగా మంత్రిని కోరారు. దీనికి స్పందించిన మంత్రి నాదెండ్ల మనోహర్ , ఈ విషయాన్ని తప్పక పవన్ కళ్యాణ్ గారి దృష్టికి తీసుకెళ్తానని, అలాగే జనసేన పార్టీ తరఫున మత్స్యకార సమస్యపై చర్చించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా అళహరి సుధాకర్ మాట్లాడుతూ, గత పది సంవత్సరాలుగా పక్క రాష్ట్రాలకు చెందిన హై స్పీడ్ బోట్లు సముద్రంలో అక్రమంగా ప్రవేశించి మత్స్య సంపదను దోచుకోవడం, మత్స్యకారుల పడవలు మరియు వలలను ధ్వంసం చేయడం వలన భారీ ఆస్తి నష్టం కలుగుతోందని తెలిపారు. తిరుపతి, నెల్లూరు, ఒంగోలు, బాపట్ల జిల్లాలకు చెందిన తీరప్రాంత మత్స్యకారుల జీవనోపాధి తీవ్రంగా దెబ్బతింటోందని పేర్కొన్నారు. ఇటీవల మత్స్యకారుల రక్షణ కోసం చర్యలు తీసుకొని నాలుగు హై స్పీడ్ బోట్లను పట్టుకొని జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌లో ఉంచినప్పటికీ, ఉన్నతాధికారులు ఇచ్చిన హామీలను పక్కనబెట్టి 17-03-2026 అర్ధరాత్రి సమయంలో ఆ బోట్లను విడుదల చేయడం పట్ల మత్స్యకారుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోందని తెలిపారు. మత్స్యకారుల భద్రత మరియు జీవనోపాధి పరిరక్షణ కోసం మెరైన్ సర్వీసును బలోపేతం చేయాలని, మత్స్యకారులకు 4-5 హై స్పీడ్ సెక్యూరిటీ బోట్లు అందిస్తే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి శ్రీ నాదెండ్ల మనోహర్ , ఈ అంశాన్ని పవన్ కళ్యాణ్ గారి దృష్టికి తీసుకెళ్లి, ప్రభుత్వం స్థాయిలో చర్చించి పరిష్కారం కనుగొనేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మత్స్యకారుల తరఫున మంత్రిగారికి కృతజ్ఞతలు తెలిపారు.

# సీఎం పర్యటనకు ముస్తాబైన వింజమూరు..!

-సీఎం పర్యటనతో ఉదయగిరికి మంచి రోజులు-ఎమ్మెల్యే కాకర్ల..!

-పూర్తిస్థాయి ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే కాకర్ల..!





**వింజమూరు విజ్ఞాన్ దినపత్రిక రిపోర్టర్ మార్చి 31** "పేదల సేవలో" భాగంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొనుటకు రేపు వింజమూరు మండలానికి విచ్చేయనున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన సందర్భంగా అన్ని విధాలుగా సమగ్ర ఏర్పాట్లును ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ గారు, సీఎం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్ , సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి కార్యక్రమ స్థలాన్ని పరిశీలించి, భద్రతా ఏర్పాట్లు, వేదిక నిర్మాణం, ప్రజల సౌకర్యాలు, రాకపోకల సదుపాయాలు వంటి ప్రతి అంశాన్ని సూక్ష్మంగా పర్యవేక్షించారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటనతో ఉదయగిరి నియోజకవర్గ అభివృద్ధికి నూతన దిశ, దిశానిర్దేశం లభిస్తుందని తెలిపారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా ఎన్టీఆర్ భరోసా వంటి పథకాల ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అండగా నిలుస్తోందని అన్నారు. అభివృద్ధి మరియు సంక్షేమాన్ని సమపాళ్లలో ముందుకు తీసుకెళ్తూ, కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తోందని, రాబోయే రోజుల్లో ఉదయగిరి నియోజకవర్గానికి మరింత అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయని విశ్వాసం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ, నియోజకవర్గ ప్రజలంతా ఈ కార్యక్రమంలో పాల్గొని దాన్ని ఘనంగా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# అమరావతి రాజధానిని ఇక ఎవ్వరూ ఇంచికూడా కదపలేరు

**- వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ**



**సైదాపురం, విజ్ఞాన్ దినపత్రిక రిపోర్టర్,మార్చి 31:** రాష్ట్రానికి అమరావతే శాశ్వత రాజధానిగా నిలిచిపోతుందని, ఇకపై దానిని ఎవ్వరూ ఇంచు కూడా కదిలించలేరని వెంకటగిరి శాసన సభ్యులు కురుగొండ్ల రామకృష్ణ స్పష్టం చేశారు. సైదాపురం మండలం లింగనపాలెం గ్రామంలో మంగళవారం సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించి అనంతరం జరిగిన సభలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.అమరావతికి చట్టబద్ధత త్వరలో పూర్తిగా సిద్ధమవుతుందని, ఇప్పటికే అసెంబ్లీలో ఆమోదం లభించిందని తెలిపారు. త్వరలో పార్లమెంట్, అనంతరం రాజ్యసభలోనూ ఆమోదం పొందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆ ప్రక్రియ పూర్తయిన తర్వాత అమరావతి రాజధానిగా శాశ్వతంగా స్థిరపడుతుందని చెప్పారు.గత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేసిన ఎమ్మెల్యే, మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి రాజధాని అంశంలో మూడుముక్కలాట ఆడారని ఆరోపించారు. ఆ నిర్ణయాల వల్ల రాష్ట్ర అభివృద్ధి దెబ్బతిన్నదని ఆరోపించారు.గత ఐదేళ్ల పాలనలో తీసుకున్న నిర్ణయాల కారణంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దెబ్బతిన్నదని, బ్యాంకులు సైతం అప్పు ఇవ్వడానికి ముందుకు రావడం లేదని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కూటమి గా ఏర్పడడం తోనే కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం లభిస్తుండటం వల్లనేఅభివృద్ధికార్యక్రమాలుకొనసాగుతున్నాయని తెలిపారు.వైసీపీ పాలనలో గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల పరిస్థితి దయనీయంగా మారిందని, కనీస మరమ్మత్తులు కూడా చేయలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బాధ్యతలు చేపట్టిన తరువాతే అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళు గా రోడ్ల అభివృద్ధి పనులు వేగం పుంజుకున్నాయని తెలిపారు. లింగనపాళ్లెం గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణం ప్రారంభం కావడం గ్రామ అభివృద్ధికి కీలకమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో మండల పార్టీ అధ్యక్షులు కొండూరు సుబ్రమణ్యం రాజు, పి ఏ సి ఎస్ అధ్యక్షులు అమ్మినేని సుబ్రమణ్యం నాయుడు, మండల కమిటీ నాయకులు, స్థానిక సర్పంచ్ నరసయరాజు, స్థానిక గ్రామనాయకులు, తహశీల్దార్ ఎం సుభద్ర,మండల ప్రజా పరిషత్తు ఏ ఓ మురళి, పలు శాఖల అధికారులు,వివిధ గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సంయుక్త సేవా సంస్థకు పి4 అవార్డును అందజేసిన ఎమ్మెల్యే కావ్య




**కావలి : విజ్ఞాన్ దినపత్రిక న్యూస్** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ౹ా4 కార్యక్రమం మొదలు పెట్టి సంవత్సరం పూర్తి అయిన సందర్భంగా కావలి ఆర్ డి ఓ సమావేశ మందిరంలో ప్రథమ వార్షికోత్సవం నిర్వహించారు.పి4 స్ఫూర్తితో సంయుక్త సేవా సంస్థ గత 7 నెలలుగా చేసిన సేవలకు గుర్తింపుగా కావలి శాసన సభ్యులు దగుమాటి వెంకటకృష్ణారెడ్డి సంయుక్త సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆటో డ్రైవర్ సురేంద్రను సన్మానించి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కావలి శాసన సభ్యులు దగుమాటి వెంకటకృష్ణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ౹ా4 స్ఫూర్తితో సంయుక్త సేవా సంస్థ ద్వారా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ పేదలకు అండగా నిలిచారని అన్నారు.సంయుక్త సేవా సంస్థ ద్వారా సేవలు అందిస్తూ మానవత్వాన్ని చాటుకున్న దాతలను అభినందించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర మాట్లాడుతూ పి4 స్ఫూర్తితో గత 7 నెలలుగా సుమారు 80 కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు.వీటిలో ముఖ్యంగా ప్రతి నెలా 40 బంగారు కుటుంబాలకు నిత్యావసర వస్తువులు బియ్యం కూరగాయలు పంపిణీ చేయడంతో పాటు విద్యార్థులు చదువుల నిమిత్తం 1,85,000 రూపాయలను తమ యొక్క సంస్థ సభ్యుల సహకారంతో అందజేశామని తెలిపారు. 21 మంది పేద మహిళలకు మూడు నెలల పాటు ఉచిత కుట్టు శిక్షణా తరగతులు నిర్వహించి వారికి సర్టిఫికెట్స్ అందజేయడంతో పాటు 8 మంది మహిళలకు స్వయం ఉపాధి నిమిత్తం తమ యొక్క సంస్థ సభ్యుల సహకారంతో కుట్టు మిషన్లు అందజేశామని తెలిపారు. తమ యొక్క సంస్థ కార్యాలయంలో సంస్థ సభ్యుల సహకారంతో ప్రతి రోజూ సాయంత్రం 70 మంది విద్యార్థులు ముగ్గురు టీచర్లను పెట్టి ఉచిత ట్యూషన్ నిర్వహిస్తూ ఉన్నామని, వారికి అవసరమైన నోట్ బుక్స్ అందజేస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తూ ఉన్నామని తెలిపారు.ఒక నిరుపేద ఒంటరి వృద్ధ మహిళ పోలమ్మకు తమ యొక్క సంస్థ సభ్యుల సహకారంతో స్వయం ఉపాధి నిమిత్తం టిఫిన్ అంగడి పెట్టించిన అండగా నిలిచామని అన్నారు.గిరిజన ప్రాంతాల్లో, సంయుక్త సేవా సంస్థ కార్యాలయంలో చదువుకుంటున్న విద్యార్థులకు దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉన్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో తమ యొక్క సంస్థ సభ్యుల సహకారంతో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పేదలకు అండగా ఉంటామని తెలిపారు. ఈ సందర్భంగా తమ యొక్క సంస్థకు అవార్డును అందజేసిన కావలి నియోజకవర్గం శాసనసభ్యులు దగుమాటి వెంకటకృష్ణారెడ్డి,పి4 కో ఆర్డినేటర్ యంగ్ ప్రొఫిషినల్ గుండెమడుగుల సత్యానందం హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తూ ఉన్నామని తెలిపారు.అలాగే తనను నిరంతరం ప్రోత్సహిస్తూ సంస్థకు అండగా నిలిచిన తమ యొక్క సంస్థ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ ఉన్నానని చెప్పారు. పై కార్యక్రమంలో ఎంపిడిఓ రహీం,డి ఓ ప్రమీల, పి4 కో ఆర్డినేటర్ యంగ్ ప్రొఫిషినల్ గుండెమడుగుల సత్యానందం,టిడిపి పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ.కిశోర్, కార్యదర్శి జ్యోతి బాబూరావు,కండ్లగుంట మధుబాబు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# పార్లపల్లిలో విపిఆర్ ఫౌండేషన్ 'అమృత ధార' వాటర్ ప్లాంట్ ప్రారంభం






**- విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 200 వాటర్ ప్లాంట్ల ద్వారా ప్రజలకు సురక్షిత తాగునీరు.**

**- కోవూరు నియోజకవర్గంలో ఇది 26 వ వాటర్ ప్లాంట్.**

**- పార్లపల్లిలో గ్రామంలో 20 నెలల్లో 1 కోటి 2 లక్షలతో అభివృద్ధి పనులు : ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి.**

**విజ్ఞాన్ దినపత్రిక కోవూరు రిపోర్టర్** రాజకీయాల్లోకి రాకముందు నుంచే తాము ప్రజా సేవకులమని పదవుల కోసం కాకుండా ప్రజలకు మరింత చేరువై సేవ చేయాలన్న ఉద్దేశంతోనే రాజకీయాల్లోకి వచ్చామన్నారు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి . విడవలూరు మండలం పార్లపల్లి గ్రామంలో విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'అమృత ధార' ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పవిత్ర సంకల్పంతో 2016లో ఉదయగిరిలో ప్రారంభమైన అమృత ధార ప్రస్థానం నేడు జిల్లా అంతటా విస్తరించిందని తెలిపారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా సుమారు 200 వాటర్ ప్లాంట్ల ద్వారా ప్రజల దాహార్తిని తీరుస్తున్నామన్నారు. కోవూరు నియోజకవర్గంలో ఇది 26వ ప్లాంట్ అని, దీని నిర్వహణ బాధ్యతను కూడా విపిఆర్ ఫౌండేషనే చూసుకుంటుందని ఆమె హామీ ఇచ్చారు. విడవలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రాత్రులు డాక్టర్లు ఉండడం లేదని స్థానికుల ఫిర్యాదుతో స్పందించిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి జిల్లా వైద్యాధికారి తో ఫోన్లో మాట్లాడి హాస్పిటల్లో నైట్ షిఫ్ట్ లో డాక్టర్లను కొనసాగించాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాక పార్లపల్లి గ్రామంలో చేసిన అభివృద్ధి పనులను వివరిస్తూ జల్ జీవన్ మిషన్ ద్వారా 36 లక్షలతో ఓవర్ హెడ్ ట్యాంక్, 11 లక్షలతో డ్రెయిన్ల నిర్మాణం, 3 లక్షలతో సామాజిక మరుగుదొడ్ల నిర్మాణం చేసిన విషయాన్ని ఆమె తెలిపారు. ఎంపీ లాడ్స్, ఉపాధి హామీ మరియు పంచాయతీ నిధులతో కలిపి మొత్తం 9 సి.సి. రోడ్ల నిర్మాణం చేసామన్నారు. ఆరగాణి కాలువపై 10 లక్షలతో కల్వర్టు, జూ= నిధులతో స్మశాన వాటికల్లో షెల్టర్ల నిర్మాణం గురించి చెబుతూ ?గడిచిన 20 నెలల పార్లపల్లి గ్రామంలో 1 కోటి 2 లక్షలతో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ఆమె వివరించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న స్మశాన వాటిక భూమి సమస్య పరిష్కారానికి తన వంతుగా రూ. 2.50 లక్షల ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. ముగ్గురు అనారోగ్య బాధితులకు జవీ=ఖీ ద్వారా రూ. 2 లక్షల 76 వేల ఆర్థిక సహాయం అందజేశామన్నారు. 1 కోటి 70లక్షల రూపాయలతో పార్లపల్లి నుండి చవటపాలెం వరకు కనెక్టింగ్ రోడ్డు మరియు కల్వర్టు నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశామని, త్వరలోనే ఈ పనులను మంజూరు చేయించి ప్రారంభిస్తామని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఈసందర్భంగా హామీ యిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం కూటమి నాయకులు, కార్యకర్తలతో పాటు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఏప్రిల్ 16 నుండి జనగణన కు 78 మంది ఏన్యమరేటర్లు 12 మంది సూపర్ వైజర్లు ఏర్పాట్లు కు కసరత్తు పై సుదీర్ఘ సమావేశం



**సైదాపురం,విజ్ఞాన్ దినపత్రిక,మార్చి 31** సైదాపురం మండలం లో ఏప్రిల్ 16 నుండి నెలాఖరు వరకు చేపట్ట బోతున్న జనగణన కు మండలం లో 78 మంది ఎన్యూమరేటర్లకు 12 మంది సూపర్ వైజర్ ల బాధ్యతలు అప్పగించేందుకు ఆయా పంచాయతీ అభివృద్ధి అధికారులకు సైదాపురం మండలం తహశీల్దార్ ఎం సుభద్ర మంగళ వారం నియామక పత్రాల ను అందజేశారు .మండల ప్రజా పరిషత్తు కార్యాలయం లో తహశీల్దార్ ఎం సుభద్ర,.ఏ ఎస్ ఓ పి వెంకటేశ్వర్లు , మండల ప్రజా పరిషత్తు ఏ ఓ మురళిధర్ రావు లు పంచాయతీ అభివృద్ధి అధికారులు తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ ఎం సుభద్ర మాట్లాడుతూ ఉన్నతాధికారులు తో మాటలు పడకుండా జనగణన ను తప్పులు లేకుండా ఆన్ లైన్ చేయాలని మార్పులు చేర్పులకు వీలు ఉండదని ఆమె సూచించారు.పంచాయతీ రాజ్ శాఖ నుండి ఉపాధి శాఖ కార్యాలయం నుండి సచివాలయ శాఖ సిబ్బంది తో పాటు గ్రామ సర్వేయర్ లను ఈ విధులకు కేటాయించ బోతున్నామని ఆమె తెలిపారు. ఇప్పటికే ఇద్దరు ఉపాధ్యాయులు, గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారులు జనగణన శిక్షణ పొంది ఉన్నారని వారి తో ఎన్యూమరేటర్ల కు జనగణన శిక్షణ కూడా అందిస్తారన్నారు.

# అభివృద్ధి, సంక్షేమాలే కూటమి ప్రభుత్వ అజెండా

**– రేగడిచెలిక గ్రామంలో 55 లక్షలతో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం.**

**– చేనేతలకు నేటి నుంచి అమలు కానున్న ఉచిత విద్యుత్ పథకం.**

**– ఇఫ్కో కిసాన్ సెజ్ లో 10 వేల 705 కోట్ల రూపాయల పెట్టుబడితో పరిశ్రమలు రాబోతున్నాయి.**

**– సిఎం చంద్రబాబు నాయుడు చొరవతోనే గమేషా కంపెనీ స్థాపన.**

**– ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సహకారంతో విపిఆర్ ఫౌండేషన్ ద్వారా స్కిల్ సెంటర్ ఏర్పాటు చేసి యువతకు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాల శిక్షణ.**

**– రైతులు పండించిన ప్రతి వడ్ల గింజ ప్రభుత్వం తీసుకుంటుంది : ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి.**






**విజ్ఞాన్ దినపత్రిక కోవూరు రిపోర్టర్** కూటమి ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమాలకు సమ ప్రాధాన్యత ఇస్తుందన్నారు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కొడవలూరు మండలం రేగడిచెలిక గ్రామంలో 40 లక్షలతో నిర్మించిన సిసి రోడ్లు, డ్రైన్లతో పాటు 15 లక్షలతో నిర్మించిన పంచాయితీ కార్యాలయ ప్రహారి గోడ ప్రారంభోత్సవ కార్యకారక్రమానికి ఆమె ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమ అనంతరం ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభత్వం అధికారంలోనికి వచ్చిన 21 నెలల్లో కొడవలూరు మండల వ్యాప్తంగా జరిగిన అభివృద్ధి పనులను వివరించారు. రైతులు పండించిన ప్రతి వడ్ల గింజను ప్రభుత్వం గిట్టుబాటు ధరకు సేకరిస్తుందన్నారు. గత 30 ఏళ్లుగా నిర్లక్షానికి గురైన ఇఫ్కో కిసాన్ సెజ్ లో కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాక పరిశ్రమలు స్థాపించేందుకు పారిశ్రామిక వేత్తలు ఆసక్తి చూపిస్తున్నారన్నారు. మరో ఏడాదిలో ఇఫ్కో కోసాన్ సెజ్ లో 10 వేల 705 కోట్ల రూపాయల పెట్టుబడితో పరిశ్రమలు రాబోతున్నాయన్నారు. ఐదేళ్లలో యువతకు 20 లక్షలు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని ఐటి మంత్రి లోకేష్ హామీ కార్యరూపం దాల్చనుందన్నారు. ఏప్రిల్ ఒకటి నుంచి చేనేత వర్గాలకు ప్రభుత్వం ఉచిత విద్యుత్తు పథకాన్ని అమలులోకి తీసుకురానుందన్నారు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి . చేనేత కార్మికులకు 200 యూనిట్లు, పవర్ లూమ్స్ కు 500 యూనిట్ల విద్యుత్ ఉచితంగా వినియోగించవచ్చన్నారు. ఈ పథకం ద్వారా నియోజకవర్గ వ్యాప్తంగా 531 మంది చేనేతలకు లబ్ది చేకూరనుందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడాతూ సిఎం చంద్రబాబు నాయుడు చొరవ కారణంగానే 2016 లో విండ్ పవర్ ఫ్యాన్లు తయారు చేసే గమేషా కంపెనీ కంపెనీ స్థాపన జరిగిందన్నారు. ఇఫ్కో కిసాన్ సెజ్‌లో ఏర్పాటు చేయబోయే పరిశ్రమలలో 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇచ్చేలా చట్టబద్ధమైన హామీ యివ్వాలని శాసనసభలో ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చిన విషయాన్ని ఆమె ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సహకారంతో కిసాన్ సెజ్ లో విపిఆర్ ఫౌండేషన్ ద్వారా స్కిల్ సెంటర్ ఏర్పాటు చేసి యువతకు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలకు సంబంధించి శిక్షణ యిచ్చి కిసాన్ సెజ్ లో ఏర్పాటు చేసే పరిశ్రమలలో ఉపాధి అవకాశాలుకల్పిస్తామన్నారు. మేం చేసిన అభివృద్ధి పనులు మీరు ఎలా ప్రారంభోత్సవం చేస్తారనే వైసిపి నేతలకు శంఖుస్థానాలు చేసాక పని పూర్తి చేయాలని టెంకాయ కొట్టేసి మేం చెప్పుకుంటే కుదరదని సూటిగా సమాధానం చెప్పారు. కూటమి ప్రభుత్వ 21 నెలల కాలంలో రేగడిచెలిక గ్రామాభివృద్ధి కోసం 1 కోటి 6 లక్షల 5 వేల579 రూపాయలు వెచ్చించిన అభివృద్ధి పనుల వివరాలను ప్రజలకు వివరించారు. సర్పంచుల పదవీ కాలం రేపటితో ముగియనుందన్నారు. స్థానిక సంస్థల నిధులను గత ప్రభుత్వం పక్క దారి పట్టించడంతో అభివృద్ధి చేయలేక అసంతృప్తితో పదవీ విరమణ చేస్తున్నారనని స్థానిక సంస్థల బలోపేతం చేసే దిశగా కూటమి ప్రభుత్వ చొరవను ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కొడవలూరు మండల ముఖ్య నాయకులు మరియు టిడిపి కూటమి పార్టీల స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మర్రిపాడు మండలం పొంగూరు గ్రామములో ఉచిత పశువైద్య శిబిరం




**బాబు ఏసిపోగు ఆత్మకూరు విజ్ఞాన్ దినపత్రిక రిపోర్టర్** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖా మంత్రి అనం రామనారాయణ రెడ్డి ఆదేశాలతో ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ వారి సౌజన్యంతో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఆరికట్ల జనార్ధన్ నాయుడు గౌరవ అధ్యక్షతన మర్రిపాడు మండలం పొంగూరు గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించటం జరిగింది. మార్కెట్ కమిటీ చైర్మన్ అరికట్ల జనార్దన్ నాయుడు మాట్లాడుతూ వేసవి కాలంలో పశువులు వచ్చే వ్యాధులు పట్ల పాడి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్తగా మందులు పంపిణి చేసారు.. ఈ కార్యక్రమంలో పొంగూరు గ్రామ నాయకులు లిఏలూరు. శివ, ఏలూరు. రమణయ్య, ఏలూరు. రామచంద్రయ్య,ఏడి. ప్రభాకర్ మరియు నందవరం పశువైద్యాధికారి వినయ్ వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి కృష్ణ ప్రసాద్ వారి సిబ్బంది,పొంగూరు గ్రామ రైతులు పాల్గొన్నారు

# 'సర్దార్ 2' తెలివైన పని..అంచనాలు పీక్స్ లో!



ప్రస్తుతం భారతీయ చిత్ర పరిశ్రమలో స్పై థ్రిల్లర్ సినిమాల హవా నడుస్తోంది. -ధురంధర్- రిలీజ్ అయిన దగ్గర నుంచి -ధురంధర్ 2- రిలీజ్ పై ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూసారు. ఈ మధ్య కాలంలో ఏ సినిమా రిలీజ్ కోసం ప్రేక్షకులు అంతగా ఎదురు చూసింది లేదు. -ధురంధర్- రిలీజ్ పైనే సర్వత్రా చర్చ జరిగింది. ఆ రకంగా ధురంధర్ అనే స్పై సినిమా ప్రేక్షకుల్లో ఎంత బలమైన ప్రభావాన్ని చూపించిదన్నది అంచనా వేయొచ్చు. ఇటీవలే రిలీజ్అయిన -ధురంధర్ ది రివేజ్- ఎంత పెద్ద విజయాన్ని నమోదు చేసిందో తెలిసిందే. దీంతో స్పై సినిమాల గ్రాఫ్ అంతకంతకు మార్కెట్ లో పెరిగింది. ఒకప్పుడు స్పై సినిమాలంటే కేవలం బాలీవుడ్ మార్కెట్ కే పరిమితమయ్యేవి. కానీ నేడు సీన్ మారింది. పాన్ ఇండియాలో స్పై కథకు ప్రేక్షకులకు అంతే కనెక్ట్ అవుతున్నారు. -ధురంధర్ 2- 1000 కోట్ల క్లబ్ లో వారం వ్యవధిలో చేరడమే అందుకు ఉదాహరణ. గూఢచారి వ్యవస్థ, దేశభక్తి ,హై-వోల్టేజ్ యాక్షన్ అంశాలకు తెలుగు ప్రేక్షకులు బ్రహ్మరథం పడుతున్నారు. ఈ సానుకూల వాతావరణం ఇప్పుడు కోలీవుడ్ స్టార్ కార్తీ నటిస్తోన్న -సర్దార్ 2- చిత్రానికి కొండంత అండగా నిలవబోతోంది. ఇది నిజంగా చిత్ర యూనిట్ తీసుకున్న అత్యంత తెలివైన



నిర్ణయమని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. గతంలో -సర్దార్- మొదటి భాగం విడుదలైనప్పుడు తమిళంలో మంచి విజయం సాధించినప్పటికీ తెలుగు రాష్ట్రాల్లో ఆశించిన స్థాయిలో ప్రభావం చూపలేకపోయింది. అప్పట్లో స్పై సినిమాలపై ప్రేక్షకులకు ఉన్న అవగాహన , ఆసక్తి పరిమితంగా ఉండటమే అందుకు కారణం. కానీ ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. -ధురందర్- సిరీస్ తర్వాత స్పై స్టోరీలలోని లోతును, ఆ ఉత్కంఠను తెలుగు జనాలు బాగా ఓన్ చేసుకుంటున్నారు. ఈ క్రేజ్ -సర్దార్ 2- అంచనాలను అప్పుడే పీక్స్‌కు తీసుకెళ్లింది. దర్శకుడు పి.ఎస్. మిత్రన్ -సర్దార్ 2-ను మొదటి భాగం కంటే రెట్టింపు బడ్జెట్ భారీ యాక్షన్ సన్నివేశాలతో తెరకెక్కిస్తున్నారు. -గూఢచారి-గా కార్తీ పర్ఫార్మెన్స్ ఈసారి మరింత పవర్‌ఫుల్‌గా ఉండబోతోందని సమాచారం. -ధురందర్ 2- విజయం అందించిన ఊపుతో? తెలుగు పంపిణీదారులు కూడా -సర్దార్ 2- రైట్స్ కోసం భారీగా పోటీ పడుతున్నట్లు సమాచారం. స్పై జోనర్‌కు ఇప్పుడున్న డిమాండ్‌ను బట్టి చూస్తే? ఈ సినిమాకు తెలుగులో భారీ ఓపెనింగ్స్ రావడం ఖాయంగా కనిపిస్తోంది. అదే జరిగితే కొన్నాళ్ల పాటు సినిమా ఇండస్ట్రీలో స్పై సినిమాల హవానే నడుస్తుంది. ప్రేక్షకులు ఇంటెలిజెన్స్ ఆపరేషన్లు , అంతర్జాతీయ కుట్రల నేపథ్యంలో సాగే కథలను ఇష్టపడుతున్నారు. ఐరన్ వేడిగా ఉన్నప్పుడే దెబ్బ కొట్టాలన్న సామెతలా స్పై సినిమాల ఫీవర్ పీక్స్‌లో ఉన్నప్పుడే ఈ జానర్ చిత్రాలను చేసి కాసులు చేసుకోవచ్చు.

